క్లుప్తంగా

నేడు ఆసరా సంబరాలు

సారవకోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఆసరా సంబరాలను నిర్వహించనున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం గోవిందరాజులు మంగళవారం తెలిపారు. మండలంలోని 1047 స్వయంశక్తి సంఘాల్లో సభ్యుల బ్యాంకు ఖాతాలకు 6,24,01,859 రూపాయలు జమ కానున్నట్లు చెప్పారు.

సచివాలయాల కోఆర్డినేటర్‌గా రవికాంత్



సరుబుజ్జిలి: మండల సచివాలయాల కోఆర్డినేటర్‌గా చిగురువలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అత్తులూరి రవికాంత్ (బిట్టు) నియమితులయ్యారు. ఈ మేరకు ఆమదాలవలసలోని స్పీకర్ క్యాంపు కార్యాలయం నుంచి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని రవికాంత్ తెలిపారు. స్పీకర్ తమ్మినేని సీతారాంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రక్త పరీక్షలు చేయాలి



మాట్లాడుతున్న సాయిగీత

హిరమండలం: పది నుంచి 19 ఏళ్లలోపు బాలికలకు రక్త పరీక్షలు శతశాతం నిర్వహించాలని హిరమండలం పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ సాయిగీత అన్నారు. ఆశ కార్యకర్తలతో పీహెచ్‌సీలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్‌డీజీ సర్వే, లెఫ్ట్ అవుట్, డ్రాపవుట్ టీకాలు పూర్తిచేయాలన్నారు. ఆరోగ్యశ్రీ డిచార్జ్ కేసులను పర్యవేక్షించాలన్నారు.

నేడు స్పీకర్ పొందూరులో పర్యటన

పొందూరు: పొందూరు మండలంలో స్పీకర్ తమ్మినేని సీతారాం బుధవారం పర్యటించనున్నారు. స్థానిక మార్కెట్ యార్డులో ఆసరా మూడో విడత సంబరాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ తెలిపారు. నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నరసన్నపేట: స్థానిక బండివీధిలోని స్వర్ణకార భవనంలో బుధవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్వర్ణకారుల సంఘం ప్రతినిధులు ఒక ప్రకటన తెలిపారు. శ్రీకాకుళం మెడీకవర్ ఆస్పత్రి సహకారంతో స్వర్ణకార, విశ్వబ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో శిబిరం జరుగుతోందన్నారు.

కల్వర్టు మరమ్మతు పనులు ప్రారంభం



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: గోపినాథపురం గ్రామం వద్ద పాడైన కల్వర్టు మరమ్మతు పనులకు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డిశాంతి మంగళవారం భూమిపూజ చేశారు. కల్వర్టు ప్రమాదకరంగా మారడంతో ప్రభుత్వం రు. 18 లక్షలు మంజూరు చేసింది. పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీల నిరసన



పాతపట్నం: నిరసనలో జేఏసీ నాయకులు

పాతపట్నం: బోయ కులస్తులను గిరిజనుల జాబితాలో చేర్చవద్దని రాష్ట్ర గిరిజన ఐక్యవేదిక కార్యదర్శి గుజ్జువాడ సోమేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణ కోరారు. ఇదే డిమాండ్‌తో పాతపట్నం రైల్వే స్టేషన్ సమీపంలోని గిరిజన భవనం వద్ద ఆదివాసీ హక్కుల సాధన ఐక్యకార్యాచరణ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో గిరిజన నాయకులు మంగళవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజమైన గిరిజనులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. మండల అధ్యక్షుడు జె.రామారావు, ఉపాధ్యక్షుడు బి.తులసయ్య, బి.ఆనందరావు, జె.అప్పలస్వామి, జి.సోమేశ్వరరావు పాల్గొన్నారు.

హంతకులను శిక్షించాలి

నరసన్నపేట: పశువైద్యాధికారి డాక్టర్ అచ్చెన్నను హతమార్చిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నరసన్నపేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.జయరాజ్, యూ.కేశవరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అచ్చెన్న హత్య వెనుక కుట్ర కోణం ఉందని అనుమానం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో నడుస్తున్నది చేతల ప్రభుత్వం

- ప్రజల జీవనస్థితిగతులను మెరుగుపరచడమే ధ్యేయం
- స్పీకర్ తమ్మినేని సీతారాం



మహిళలకు చెక్కు అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని

ఆమదాలవలస: రాష్ట్రంలో నడుస్తున్నది మాటల ప్రభుత్వం కాదు..చేతల ప్రభుత్వమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపరచడమే సర్కార్ ధ్యేయమని చెప్పారు. ఆమదాలవలస పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మహిళలతో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గాలి కబుర్లు చెబుతూ, ప్రజలను మభ్య పెడుతూ, పాలనను గాలికొదిలేసిన గత పాలకులకు భిన్నంగా రాష్ట్రంలో సుభిక్షమైన పరిపాలన సాగుతోందన్నారు. జగనన్న పాలనలో మహిళా సంక్షేమం వెల్లివిరిస్తోందన్నారు. అన్నిరంగాల్లో మహిళలు అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి ఆశయమన్నారు. పాదయాత్రలో మహిళల కష్టాలను కళ్లారా చూసి వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. ఆసరా, చేయూత, సున్నావడ్డీ తదితర పథకాలన్నీ మహిళల పేరుతో అందచేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. మహిళా సాధికారతలో దేశానికే ముఖ్యమంత్రి ఆదర్శంగా నిలిచారన్నారు. దిశ చట్టంతో మహిళలకు రక్షణగా నిలబడ్డారన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో అండగా ప్రభుత్వం నిలుస్తోందన్నారు. జగన్‌కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పే ధైర్యం చంద్రబాబుకు ఉందా అని ప్రశ్నించారు. జగన్ పాలనలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. పార్టీ నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకుడు ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ.. 2.20 లక్షల కోట్ల రూపాయలను వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ప్రజలకు అందించిన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతోందన్నారు. విద్యారంగంలో విప్లవాన్ని సృష్టించి, సగటు పేద కుటుంబానికి చెందిన ప్రతి విద్యార్థి సర్కారు బడిబాట పడుతున్నారన్నారు. నాడు-నేడు, అమ్మఒడి, చేయూత వంటి పథకాలతో ప్రజల మనసులు గెలిచిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో పీఆర్‌డీఏ, మెప్మా పీడీలు, మున్సిపల్ కమిషనర్ కె.అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, ఆమదాలవలస జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు, పార్టీ మండల అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామమూర్తి, మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, మున్సిపల్ సచివాలయాల కోఆర్డినేటర్ ఎ.ఉమామహేశ్వరరావు, నాయకుడు జె.కె.వెంకటేశ్వరరావు, ఎం.కూర్మారావు, చల్లా సింహాచలం, మొండేటి కూర్మారావు, కె.రామకృష్ణ, చిన్నారావు, డి.శ్యామలరావు పాల్గొన్నారు.



మహిళలతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

మన భవిష్యత్ బాధ్యత మనదే

- డీసీసీబీ చైర్మన్ రాజేశ్వరరావు



గృహసారథులకు కిట్లు అందజేస్తున్న రాజేశ్వరరావు, నాయకులు

పోలాకి: మనల్ని ఎవరు పరిపాలించాలి అనే విషయంలో బాధ్యత గల పౌరుడిగా మన భవిష్యత్‌కు బాధ్యత మనమే తీసుకోవాలని డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని పలు సచివాలయాల పరిధిలో జగనన్నే మన భవిష్యత్‌పై అవగాహన సమావేశాలను గృహసారథులతో మంగళవారం నిర్వహించారు. మండల జేసీఎస్ కన్వీనర్ కణితి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని మండల కేంద్రం పోలాకిలో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14 ఏళ్లు పరిపాలించిన పెద్దమనిషి మళ్లీ అధికారంలోకి వస్తే పేదప్రజలు మరో పాతికేళ్లు వెనుకబడిపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో నడుస్తున్న సంక్షేమరాజ్యాన్ని వదులుకోవటానికి ఎవరూ సిద్ధంగా లేరన్నారు. గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి వారి అవసరాలను గుర్తించి స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు రెంటికోట త్రినాథరావు, పార్టీ నాయకులు చింతాడ ఉమామహేశ్వరరావు, మజ్జి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సంక్షేమాన్ని వివరించాలి



జలుమూరు: కిట్లు అందజేస్తున్న గోపి



నరసన్నపేట: చోడవరంలో మాట్లాడుతున్న ఎంపీపీ మురళి

నరసన్నపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. కామేశ్వరిపేట, చోడవరం, జమ్ము, తామరాపల్లి గ్రామాల్లో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో సచివాలయ మండల కన్వీనర్ సురంగి నర్సింగరావుతో కలిసి మంగళవారం సమావేశం నిర్వహించారు. అనంతరం గృహ సారథులకు కిట్లు పంపిణీ చేశారు. గ్రామాల్లో టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. పార్టీ నాయకులు చింతు రామారావు, రాజాపు అప్పన్న, బొబ్బాది ఈశ్వరరావు, వాకముళ్ల చక్రధర్, జోగినాయుడు, అంపోలు సుధ, వాన గోవిందరావు పాల్గొన్నారు.

జలుమూరు: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లాలని ఎంపీపీ వాన గోపి అన్నారు. కొమనాపల్లి, సుబ్రహ్మణ్యపురం గ్రామాల్లో గృహసారథులతో సమావేశం నిర్వహించి కిట్లు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, నాయకులు ఎం.శ్యామలరావు, మండల సలహాదారు పైడి వితలరావు, సర్పంచ్ కూన రమణ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



నరసన్నపేట: హడ్కో కాలనీలో పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నరసన్నపేట: వైఎస్సార్ పింఛన్ భరోసాలో భాగంగా పింఛన్ల పంపిణీ మంగళవారం చురుగ్గా జరిగింది. పింఛన్ల పంపిణీలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు. మండలంలో 10,600 మంది పింఛన్‌దారులు ఉండగా.. 92 శాతం మేర పంపిణీ పూర్తయినట్టు అధికారులు తెలిపారు.

వేగవంతం చేయాలి

ఎల్.ఎన్.పేట: పింఛన్ల పంపిణీని వేగవంతం చేయాలని ఎంపీడీవో ఆర్.కాశీప్రసాద్ అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ కార్యదర్శులతో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు.

తలెత్తుకునేలా సీఎం జగన్ పాలన



పెద్దలక్ష్మీపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: ప్రజాప్రతినిధులందరూ తలెత్తుకుని ప్రతిఇంటికీ వెళ్లగలిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన చేస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. త్వరలో జరగనున్న జగనన్నే మన భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలకు నాయకులను సన్నద్ధం చేసే కార్యక్రమాన్ని పెద్దలక్ష్మీపురం గ్రామంలో మంగళవారం ప్రారంభించారు. ఏడో తేదీ నుంచి జగనన్నే మనభవిష్యత్, మానమ్మకం నువ్వేజగన్ కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని 11 సచివాలయాలను సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి పథకాలను అందిస్తున్నారని, అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేవిధంగా సిబ్బంది చూడాలన్నారు. అలాగే గ్రామ వలంటీర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులకు భవిష్యత్ కార్యాచరణపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు, కోఆప్షన్ సభ్యుడు భాస్కర్‌దాస్, మండల నాయకులు బైపోతు ఉదయ్‌కుమార్, పల్లియోగి, జయమునిరావు, కరణం శశిభూషణరావు, దువ్వాడ బాలరాజు, ఎంపీడీవో చంద్రకుమారి, తహసీల్దార్ సరోజిని ఉన్నారు.

సక్రమంగా భూసర్వే



అధికారులతో సమీక్షచేస్తున్న ఆర్డీవో శాంతి

సరుబుజ్జిలి: భూముల రీసర్వే పారదర్శకంగా నిర్వహించేలా అధికారులు బాధ్యత తీసుకోవాలని శ్రీకాకుళం ఆర్డీవో బొడ్డేపల్లి శాంతి అన్నారు. సరుబుజ్జిలి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా భూసర్వే విషయమై అధికారులతో సమీక్షించారు. సర్వే ప్లాంటేషన్ ఏవిధంగా సాగుతున్నది అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమీక్షలో తహసీల్దార్ రమేష్‌కుమార్, డీటీ పద్మావతి, ఆర్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

శ్రీముఖలింగాన్ని వారసత్వ సంపదగా గుర్తించాలని వినతి



కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందచేస్తున్న దృశ్యం

జలుమూరు: దక్షిణ కాశీగా పేరు గాంచిన శ్రీముఖలింగం శైవక్షేత్రాన్ని ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించాలని సామాజిక కార్యకర్త నాయుడుగారి రాజశేఖర్ కోరారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డిని మంగళవారం కలిసి వినతి పత్రం అందచేశారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు రాజశేఖర్ తెలిపారు.

ఉపాధి పనులు ప్రారంభం



ఆమదాలవలస రూరల్: పనులు ప్రారంభిస్తున్న దృశ్యం



పాతపట్నం: పనులకు సిద్ధమవుతున్న వేతనదారులు

ఆమదాలవలస రూరల్: అక్కులపేట గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు గురుగుబెల్లి ప్రభాకరరావు మాట్లాడుతూ.. పనులను వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెరువులు, సాగునీటి కాలువల్లో పనులు సక్రమంగా పూర్తి చేయాలన్నారు.

పాతపట్నం: ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు అన్నెపు ఉమామహేశ్వరరావు అన్నారు. పెద్దలక్ష్మీపురం గ్రామంలో పనులను ప్రారంభించారు. ఫీల్డ్ అసిస్టెంట్ బి.నాయుడు పాల్గొన్నారు.

నెలాఖరుకు పనులు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఏపీడీ రాధ

హిరమండలం: ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న అమృత సరోవర్ ట్యాంక్ పనులు ఈనెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఏపీడీ పి.రాధ అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం భవనంలో హిరమండలం, ఎల్ఎన్‌పేట, బూర్జ, సరుబుజ్జిలి, కొత్తూరు, పాతపట్నం ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2022–23 ఆర్థిక సంవత్సరంలో పూర్తయిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులపై చర్చించారు. ఎంపీడీవో బి.శైలజ, మండల సూపరింటెండెంట్ రవీంద్రబాబు పాల్గొన్నారు.

మార్కెట్ వేలం ఖరారు

కొత్తూరు: కొత్తూరు మండలం కల్లెమ్మ మార్కెట్ నిర్వహణ కోసం సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్ నాయుడు సమక్షంలో అధికారులు మంగళవారం వేలం నిర్వహించారు. 105 మంది వేలం పాటలో పాల్గొనగా కోనూరు బాబూరావు రూ.2.04 లక్షలకు పాడుకున్నట్టు అధికారులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రామనారాయణ, ఈవోపీఆర్డీ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

15,121 మందికి 'ఆసరా'

పొందూరు: మండలంలోని 1319 స్వయం సహాయక సంఘాల్లోని 15,121 మంది సభ్యులకు 9,45,27,890 రూపాయలు ఆసరా పథకం ద్వారా అందిందని ఎంపీపీ కిల్లి ఉషారాణి, ఏపీఎం గురుగుబెల్లి శ్యామలరావులు తెలిపారు. ఆసరా సంబరాలను స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం నిర్వహిస్తామన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెరగడంతోపాటు రైతులకు ఆర్థికంగా పెట్టుబడి ఆదా అవుతోందని ప్రకృతి వ్యవసాయం మండల కోఆర్డినేటర్ ఎం.పద్మావతి, వైకేపీ ఏపీఎం ఎస్.రవిరాజ్ అన్నారు. మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో మంగళవారం మహిళా సంఘాల సభ్యులతో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. పెరటి పంటగా ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతిలో కూరగాయల పంటలను పండించాలని అన్నారు. వైకేపీ సీసీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పాతపట్నం: మాట్లాడుతున్న వైద్యుడు శ్రీధర్



జలుమూరు: మాట్లాడుతున్న శ్రీకాంత్

పాతపట్నం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు అప్రమత్తంగా ఉండాలని బైదలాపురం పీహెచ్‌సీ వైద్యుడు ఐ.శ్రీధర్ అన్నారు. పీహెచ్‌సీలో మంగళవారం ఆశ డే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పంచాయతీ సిబ్బందితో కలిసి ఆశ వర్కర్లు శానిటేషన్ చేసుకోవాలన్నారు. ఈవో లింగమూర్తి, సూపర్‌వైజర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జలుమూరు: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జలుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి తాడేల శ్రీకాంత్ అన్నారు. స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో ఆరోగ్య, ఆశ కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలన్నారు. సమావేశంలో పర్యవేక్షకులు చిన్నరాజులు, హెచ్ఎస్ పద్మావతి ఉన్నారు.

ఖరీఫ్‌కు అన్నదాత సమాయత్తం



బూర్జ: ఖరీఫ్ వ్యవసాయ పనులకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో వ్యవసాయానికి అనుకూలంగా పొలాలను దుక్కుదున్నే పనులను చేపడుతున్నారు. బూర్జ మండలంలోని పలు గ్రామాల్లో రైతులు దుక్కి పనుల్లో నిమగ్నమయ్యారు.

ఇంటి వద్దకే వైద్యం

- 'ఫ్యామిలీ డాక్టర్' నిర్వహణకు ఏర్పాట్లు
- మూడు నియోజకవర్గాల్లో 22 వాహనాలు సిద్ధం

ఫ్యామిలీ డాక్టర్ కోసం నియోజకవర్గాల వారీగా కేటాయించిన 104 వాహనాల వివరాలు

నియోజకవర్గం	పీహెచ్‌సీలు	వాహనాల సంఖ్య
నరసన్నపేట	9	7
ఆమదాలవలస	10	6
పాతపట్నం	11	9



నరసన్నపేట మండలం యరబాడులో ఫ్యామిలీ డాక్టర్ పథకం ట్రైయిల్ రన్‌లో భాగంగా గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యులు

నరసన్నపేట: రోగులకు మరింత మెరుగ్గా వైద్య సేవలు అందించడానికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ పథకం ద్వారా 104 వాహనంతో గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందించనున్నారు. ఈ పథకం ద్వారా వైద్య సేవలు అందించడానికి ఇప్పటికే ట్రైయిల్ రన్‌ను వైద్య శాఖ పూర్తి చేసింది. ఇది విజయవంతం కావడంతో ఈ నెల ఆరో తేదీ నుంచి పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించడానికి యంత్రాంగం సిద్ధమవుతోంది.

రోజంతా ఒకే గ్రామంలో..

ప్రస్తుతం 104 వాహనంలో సిబ్బంది ఎంపిక చేసిన గ్రామాల్లో నెలకు ఒకసారి సందర్శించి పరిమిత స్థాయిలో వైద్య సేవలు అందించేవారు. ఫ్యామిలీ డాక్టర్ పథకంతో ఒక్కో సచివాలయంలో నెలకు రెండు పర్యాయాలు 104 వాహన సిబ్బంది గ్రామాల్లో పర్యటించడంతోపాటు రోజంతా ఒకే గ్రామంలో ఉండి వైద్య సేవలు అందించనున్నారు. అనారోగ్య సమస్యలతో ఆరోగ్య కేంద్రానికి రాని వారి ఇంటికి స్వయంగా డాక్టర్, వైద్య సిబ్బంది వెళ్లి రోగిని పరీక్షించి మందులు అందచేస్తారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇద్దరేసి డాక్టర్లను పూర్తిస్థాయిలో నియమించడంతో ఒకరు పీహెచ్‌సీలో, మరొకరు ఫ్యామిలీ డాక్టర్ క్యాంపులకు హాజరవుతారు. ఒక్కో పీహెచ్‌సీకి ఒక్కో వాహనాన్ని మంజూరు చేశారు.

72 రకాల మందులు, 14 రకాల రక్త పరీక్షలు

ఫ్యామిలీ డాక్టర్‌లో భాగంగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఇక నుంచి 72 రకాల మందులు అందుబాటులో ఉంచుతారు. అలాగే 14 రకాల రక్త పరీక్షలు చేస్తారు. ప్రతి తనిఖీ, రక్త పరీక్షలను ఏపీఎంవో హెల్త్ యాప్‌లో నమోదు చేస్తారు. దీర్ఘకాలిక వ్యాధులతో పాటు అంటువ్యాధులు ఇతర అత్యవసర మందులు అందుబాటులో ఉంటాయని ఉర్లాం పీహెచ్‌సీ వైద్యులు అరవింద్ చెప్పారు.

అన్ని రకాల వైద్య సేవలు



ఫ్యామిలీ డాక్టర్ పథకంలో భాగంగా ప్రతి సచివాలయాన్ని ఇక నుంచి 104 వాహన సిబ్బంది నెలకు రెండు రోజులు సందర్శించనున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ గ్రామంలో ఉండి ప్రజలకు వైద్య సేవలు అందిస్తారు. నడవ లేని, నిండు గర్భిణుల ఇంటికి వెళ్లి తనిఖీలు చేసి వైద్యం అందించనున్నారు. ఈమేరకు సిబ్బందిని ప్రభుత్వం నియమించింది.

– లక్ష్మణరావు, 104 జిల్లా మేనేజర్

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన సేవలు



ఫ్యామిలీ డాక్టర్ పథకం అమలులో భాగంగా ట్రైయిల్ రన్‌ను మా గ్రామంలో నిర్వహించారు. చాలా బాగుంది. దీని ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. గ్రామానికే వైద్యులు వచ్చి అవసరమైన తనిఖీలు, రక్త పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు.

తవిటినాయుడు, లుకలాం సర్పంచ్